క్లుప్తంగా

సర్టిఫికెట్ అందజేత



రిత్వికకు సర్టిఫికెట్ అందజేస్తున్న మంజుల

శాయంపేట : చాగంటి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన డ్రాయింగ్ పోటీల్లో మండల కేంద్రానికి చెందిన విద్యార్థి మారెపల్లి రిత్విక పాల్గొన్నారు. ఈ సందర్భంగా అకాడమి డైరెక్టర్ మంజుల పర్యావరణ విభాగంలో రిత్వికకు సర్టిఫికెట్‌ను అందజేశారు. రిత్విక ప్రస్తుతం ఆత్మకూరు మండలం తిరుమలగిరి కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదోతరగతి చదువుతుంది.

వైకుంఠరథం బహూకరణ



స్వర్గరథం అందజేస్తున్న దాతలు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన బైరీ వెంకటనారాయణ తన తల్లిదండ్రులు కనకయ్య-లచ్చమ్మ, భార్య సరోజన జ్ఞాపకార్థం రూ.7లక్షల విలువగల స్వర్గ రథాన్ని ఆదివారం గ్రామపంచాయతీకి బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జక్కుల అనితరమేష్, సర్పంచ్ ఎర్రబెల్లి చంద్రకళ, తిరుపతిరావు, వెంకటరాజం, జగన్‌మోహన్, పూర్ణచందర్, కేశవప్రసాద్ తదితరులు ఉన్నారు.

రూ.50 వేల సాయం

గీసుకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు తమ తోటి మిత్రుడి కుటుంబానికి రూ.50 వేల సాయం అందించి అండగా నిలిచారు. ఎస్కే వాజీద్ గతేడాది కరోనాతో మృతి చెందగా అతడితో కలిసి టెన్త్ చదువుకున్న మిత్రులు ఆయన ఇద్దరు కూతుర్లకు ఆదివారం రూ.50 వేల సాయం అందించారు. కార్యక్రమంలో వాజీద్ మిత్రులు శివప్రసాద్, తాటికొండ నరేందర్, నర్సింహస్వామి, ఆసం లింగమూర్తి, భవాని, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ఎంపీల సస్పెన్షన్ అప్రజాస్వామికం



పోస్టాఫీస్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

వరంగల్ చౌరస్తా : పార్లమెంటులో ఇటీవల జరిగిన అప్రజాస్వామిక బీజేపీ విధానాలను తీవ్రంగా ఖండించాలని, ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేయడాన్ని ప్రజాస్వామికవాదులంతా నిలదీయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ముక్కెర రామస్వామి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యురాలు నలింగంటి రత్నమాల మాట్లాడుతూ.. 141 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెండ్ చేశారని, వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలన్నారు. పార్లమెంటులో భద్రత వైఫల్యంపై ప్రధాని బాధ్యత వహించాలన్నారు. భారత రాజ్యాంగానికి ప్రజాస్వామ్య, లౌకిక విధానా లకు వ్యతిరేకంగా బీజేపీ తీసుకున్న విధానాలతో పార్లమెంట్‌లో తప్పుపడితే ప్రతిపక్ష పార్టీల ఎంపీలను సస్పెన్షన్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అరూరి కుమార్, వలదాసు దుర్గయ్య, నాయకులు ప్రశాంత్, కట్టప్ప, జుబేదా బేగం, మహేష్, ఉదయ్, కిరణ్, అరుణ్, సాయి, ప్రవీణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



విద్యారణ్యపురి: హనుమకొండలోని జేఎన్ఎస్‌లో ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు జరిగిన అండర్–17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో హనుమకొండ ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ విద్యార్థి ఆర్.శివ ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం జి.వి.రమణారావు ఆదివారం తెలిపారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రాణి ఆధ్వర్యంలో శిక్షణ పొందిన శివ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో తన ప్రతిభ చాటారన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, డీఈఓ ఎండి.అబ్దుల్ హై, అజీజ్‌ఖాన్ చేతుల మీదుగా బహుమతితో పాటు ప్రశంస పత్రం, జ్ఞాపికను అందుకున్నారని తెలిపారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు సంబంధిత కాంట్రాక్టర్ పరిహారం చెల్లించాలని లేనిచో తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రానికి చెందిన బాధితులు స్థానిక సర్పంచ్ పర్వతగిరి రాజు ఆధ్వర్యంలో హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అలాగే బాధితులు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని కోరగా వెంటనే స్పందించి పీఆర్ డీఈ లింగారెడ్డికి ఫోన్ చేసి అందరికీ పరిహారం రూ.5లక్షలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజు, బయ్యకుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి

జిల్లా జడ్జి సత్యేంద్ర



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జడ్జి సత్యేంద్ర

ధర్మసాగర్ : ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లోని సృజనాత్మక శక్తిని వెలికితీయాలని జిల్లా జడ్జి సత్యేంద్ర అన్నారు. మండల పరిధి పెద్దపెండ్యాల శివారులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్, వరంగల్ సీబీఎస్ఈ పాఠశాలలో ఆదివారం జరిగిన పదో వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థిలో ఏదో ఒక ప్రత్యేక నైపుణ్యం దాగి ఉంటుందని, దాన్ని గుర్తించి ఆ రంగంలో విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. కేయూ మాజీ వీసీ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు వివిధ అంశాల మీద ఆసక్తి పెరిగితే వాటిని సాధించే శక్తి వస్తుందన్నారు. ఉన్నత స్థాయికి చేరిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి, ప్రెసిడెంట్ వి.రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వి.రాకేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ పిళ్లై మంజుమోల్ శివశంకర్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

నేను కూలీ బిడ్డనే..



కూలీల వద్ద భోజనం చేస్తున్న ఎస్సై అశోక్

దామెర : స్థానిక ఎస్సై కొంక అశోక్ ఆదివారం ల్యాదెళ్ల–దమ్మన్నపేట గ్రామాల మధ్య పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో దమ్మన్నపేట గ్రామం సమీపంలో చెట్టుకింద కూర్చోని కొంత మంది కూలీలు భోజనం చేస్తున్నారు. ఇది గమనించిన ఎస్సై వారి వద్దకు వెళ్లి వారితో మాట్లాడి ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు తెచ్చుకున్న భోజనం తిన్నారు. ఈ సందర్భంగా ఎస్సై కన్నీటి పర్యంతమవుతూ.. తాను సైతం పొలం పనులు చేసేవాడినని, కూలీబిడ్డనే అని గుర్తు చేశారు. గ్రామాల్లో శాంతిభద్రతల విషయంలో ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. అంతేకాకుండా అత్యవసర పరిస్థితిలో డయల్–100కు ఫోన్ చేయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పడి ముట్టిస్తున్న శివకుమార్

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఆకుల శివకుమార్ గురుస్వామి కుటీరంలో ఆదివారం అయ్యప్ప మహా పడిపూజను గురుస్వామి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పడిని అలంకరించి గణపతి, లక్ష్మీదేవి, అయ్యప్పస్వామి పటాలకు అలంకరించి అష్టోత్తరాలు, శరణుఘోషతో వేద మంత్రాల మధ్య అయ్యప్పకు అభిషేకం నిర్వహించారు. అయ్యప్ప భక్తుల శరణు నామస్మరణ భజనలతో మార్మోగించారు. గురుస్వామి శివకుమార్ పడిని ముట్టించారు. అనంతరం అనంతరం అయ్యప్ప భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సామల భిక్షపతి, పసునూటి భిక్షపతి, సామల రవీందర్, నామని శివ, సైకిలాబ్, వివిధ గ్రామాలకు చెందిన అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి దివ్య జీవన మహాసభలు

నయీంనగర్ : 48వ దివ్య జీవన మహాసభలు ఈనెల 26, 27, 28వ తేదీల్లో యాదాద్రి (యాదగిరిగుట్ట), శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రాంగణం, వ్రత మండపం–2లో జరుగుతాయని స్వామి విష్ణుదేవానంద తెలిపారు. ఆదివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్య జీవన సభలకు వచ్చే డెలిగేట్స్‌కు ఉచిత భోజన, వసతి ఏర్పాట్లు కల్పించబడుతాయన్నారు. కార్యక్రమంలో సంఘం వరంగల్ శాఖ అధ్యక్షురాలు బి.విజయలక్ష్మి, ఎస్.ప్రమోద్‌కుమార్, శ్రీదేవి, సమీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు చేయూత



ఆత్మకూరు: పరామర్శిస్తున్న విజయ్‌చందర్‌రెడ్డి

ఆత్మకూరు : బాధిత కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన నకినబోయిన సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా సాంబయ్య కుమారులు రమేష్, నాగరాజు, సురేష్‌ను ఆదివారం విజయ్‌చందర్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, గట్టు వేణు, బత్తిని వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

శాయంపేట : మండలంలోని ప్రగతిసింగారం గ్రామానికి చెందిన లోకలబోయిన కుమారస్వామి ఇటీవల మృతి చెందాడు. కాగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు. ఉపసర్పంచ్ మోరె శ్రీనివాస్, కేసరి కట్టయ్య, మోరె రాజయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



శాయంపేట: బియ్యం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి ఎల్‌ఓసీ..

హన్మకొండ: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే ఆర్థిక స్తోమత లేని నిరుపేదకు వైద్యం చేయించుకునేందుకు సీఎం సహాయ నిధి నుంచి ఎల్‌ఓసీని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అందించారు. హనుమకొండ సమ్మయ్యనగర్‌కు చెందిన పి.రాజేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం రూ.10 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారని బాధితుడి తండ్రి సత్యనారాయణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.దీంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయించి ఆ ఎల్‌ఓసీని సత్యనారాయణకు ఆదివారం హనుమకొండలో అందించారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

నర్సంపేట: లైంగిక వేధింపుల నుంచి బాలబాలికలను రక్షించడానికి ఏర్పాటు చేసిన పోక్సో చట్టంపై సమాజంలోని ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని లీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవికుమార్ తెలిపారు. పట్టణంలోని గీతాంజలి గ్లోబల్ పాఠశాల ఉపాధ్యాయులకు లీడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై ఆదివారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల పై జరుగుతున్న అమానవీయ ఘటనలు సమాజాన్ని తీవ్ర కలవరపాటుకు గురి చేస్తున్నాయని చెప్పారు. సమస్యను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్రమైన పోక్సో చట్టాన్ని రూపొందించిందని తెలిపారు. వికృత చేష్టలతో చిన్నారుల జీవించే హక్కును హరించి వారికి ముప్పు వాటిల్లేలా చేస్తే ఆ చట్టం ద్వారా కఠినంగా శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు. 2012లో వచ్చిన పోక్సో చట్టం 18 ఏళ్లలోపు బాలలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందన్నారు. అలాగే 12 ఏళ్లలోపు వయస్సున్న బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠిన శిక్ష అమలయ్యేలా చట్టాన్ని రూపొందించారని చెప్పారు. భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా తమవంతు బాధ్యతగా పిల్లలకు, తల్లిదండ్రులకు ముందు నుంచే పోక్సో చట్టంపై అవగాహన కల్పించాలని కోరారు. సదస్సులో గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ సుబ్బారావు, సురేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

హసన్‌పర్తి : మండలంలోని సిద్దాపురం జెడ్పీపాఠశాల 1999–2000 బ్యాచ్ పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఉపాధ్యాయులు బాబురావు, రాములు, ప్రతాప్, శంకరయ్యను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది సీపీఐ



సీపీఐ జెండా ఎగురవేసిన శ్రీనివాస్‌రావు

ఎల్కతుర్తి : సీపీఐ 99వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఎర్రజెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దున్నేవాడికే భూమి కావాలని భూపోరాటాలు చేసి లక్షలాది ఎకరాలు భూమి పంచి కులమత తత్వానికి, మతోన్మాదానికి వ్యతిరేకంగా శాంతి కోసం ప్రజలను చైతన్య పరిచింది సీపీఐ అని అన్నారు. నైజాం వెట్టిచాకిరి, బానిసత్వానికి వ్యతిరేకంగా దొరల గడీల నుంచి 3వేల గ్రామాలకు విముక్తి చేసి 10లక్షల ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర సీపీఐకే దక్కిందన్నారు. జిల్లాలో భారీ పరిశ్రమలు, ఇళ్ల స్థలాలు పక్కా ఇళ్లు నిర్మించుటకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి ఉట్కూరి రాములు, ఆదరి శ్రీనివాస్, కర్రె లక్ష్మణ్, వెంకటరమణ, మర్రి శ్రీనివాస్, శనిగరం రాజ్‌కుమార్, నిమ్మల మనోహర్, భాస్కర్‌రెడ్డి, స్వామి, లలిత, గడ్డ రాజనర్సుతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ఎర్రజెండాను ఆవిష్కరిస్తున్న మేకల రవి

పేదల హక్కుల సాధనకు కృషి చేద్దాం..

మామునూరు : పేదల హక్కుల సాధన కోసం మరింతగా కృషి చేద్దామని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, సహాయ కార్యదర్శి షేక్ భాషామియా అన్నారు. సీపీఐ 99వ వార్షి కోత్సవం సందర్భంగా ఆదివారం ఖిలా వరంగల్ మండలం బీఆర్ అంబేడ్కర్‌నగర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై అరుణ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం కోసం పోరాడిన ఘనత సీపీఐదేనని చెప్పారు. కూడు,గూడు లేని నిరుపేద ప్రజలకు అండగా ఎర్రజెండా ముందు ఉంటుందన్నారు. ఇప్పటికైనా పాలక వర్గాలు ఉన్నత వర్గాలకు ఊడిగం చేయడం మానుకొని పేద ప్రజలకు న్యాయం చేసే దిశగా ప్రభుత్వాల పాలన కొనసాగించాలని వారు తెలిపారు. కార్యక్రమంలో దుండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, ఓర్సురావు, తాళ్లపల్లి జాన్‌పాల్, ఎండి అక్బర్, యాకూబ్, నవంబి, విజయలక్ష్మి, చిట్యాల సువర్ణ, చిరంజీవి, రాజు, జోసెఫ్ కుమార్, దీపిక ప్రశాంత్, ప్రభాకర్, రాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

వేలేరు : ప్రతీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆపార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు మండలంలోని పీచర గ్రామంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శివరాత్రి రవి తదితరులు ఆపార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జల్తారి సంపత్, గ్రామశాఖ అధ్యక్షుడు మంతపురి రాజు,మండల ఉపాధ్యక్షుడు పెద్ది నగేష్, నాయకులు కొలిపాక వెంకటేశ్, పోలు తిరుపతి, నాగరాజు, ఎల్లయ్య, హరీఫ్, సుధాకర్, మహేందర్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు

హన్మకొండ : కమల్ కింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండలోని టీటీడీ కల్యాణమండపంలో ఆదివారం ఉమ్మడి జిల్లా స్థాయి చదరంగ పోటీలు నిర్వహించారు. అండర్–7, 9, 11, 15 బాలబాలికలకు నిర్వహించిన పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి 230 మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకుడు, అకాడమి చైర్మన్ రాంప్రసాద్ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో జి.అవినాష్, ఎం.ధృవాన్ష్, బి.ఆయాన్ష్, జి.ఆయాన్ష్,బి. మహితేజ్ వరుసగా విజేత స్థానాల్లో నిలబడ్డారు. బాలికల విభాగంలో ఏ.శౌర్య, జి.మాన్విత, పి షణ్ముఖి, సీహెచ్.నాగవేదశ్రీ విజేతలుగా నిలిచారు. పోటీలకు ముఖ్య అతిథిగా వరంగల్ డెమోక్రటిక్ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేంద్ర హాజరై విజేతలకు నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్లు, పతకాలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్బిటర్లు అభిలాష్, సాయి, మణికంఠ, అనిల్, శ్రీకాంత్, ఉదయ్ పాల్గొన్నారు.



పతకాలు, ట్రోఫీలతో చిన్నారులు

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు



పరకాల: కేక్ కట్ చేస్తున్న కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్



పరకాల: వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దిలీప్ తదితరులు

పరకాల : పరకాల పట్టణంలో మినీ క్రిస్మస్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చర్చిలు క్రిస్మస్ వేడుకలకు ముస్తాబయ్యాయి. కేక్ కటింగ్‌లతో ముందస్తు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదే విధంగా సేవా సంస్థల ఆధ్వర్యంలో నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. పరకాల పట్టణంలోని నిరుపేదలకు ప్రేమ కరుణ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఆదివారం 2వ వార్డులోని చర్చి ఆవరణంలో 100 మంది నిరుపేదలకు చీరలు, దుప్పట్లను ఆ సంస్థ నిర్వాహకుడు బొచ్చు దిలీప్ చేతుల మీదుగా అందజేశారు. 1వ వార్డులోని షారోన్ మందిరంలో పాస్టర్ దయాకర్, గూడెల్లి రేచల్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ వేడుకలకు స్థానిక కౌన్సిలర్ మడికొండ సంపత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ కరుణ సంస్థ నిర్వాహకుడు దిలీప్ గత పదేళ్లుగా నిరుపేద కుటుంబాలకు, వితంతువులకు, దివ్యాంగులకు, వృద్ధులకు సేవా దృక్పథంతో ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాస్టర్ మంద ఏలియా, సిస్టర్ తాథియా, బొచ్చు రమేష్, బొచ్చు సాముసాన్, బొచ్చు సంపత్, ఒంటేరు రాజు, బొచ్చు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకకు చర్చిల ముస్తాబు

ఎల్కతుర్తి : క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని మండలంలోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్థానిక ఎస్సీ కాలనీలోని బేతేల్ ప్రార్థన మందిరం విద్యుత్ దీప కాంతులతో మిరుమిట్లు గొలుపుతుంది. క్రిస్మస్ సందర్భంగా నేడు(సోమవారం) క్రైస్తవులు ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల్లో క్రైస్తవులు దేవుడిరాక సూచికంగా కేక్ కట్ చేయనున్నట్లు వారు తెలిపారు.

కాజీపేటలో..

కాజీపేట : మండలంలోని సోమిడి శివారులో ఉన్న తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ స్కూల్‌లో ఆదివారం మినీ క్రిస్మస్ వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం ప్రారంభించారు. ఉపాధ్యాయుల మార్గదర్శకంలో విద్యార్థులు అందమైన పశువుల పాకను నిర్మించి క్రీస్తు జన్మ వృత్తాంతాన్ని తెలిపే బాలయేసు, మేరీమాతా, జోసెఫ్ బొమ్మలతో అందరి దృష్టిని ఆకర్షించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, చైతన్య, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపకాంతుల్లో బేతేల్ ప్రార్థన మందిరం

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



హసన్‌పర్తి : పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీతారాం కోరారు. భీమారంలో పెన్షన ర్స్ డే వేడుకలు ఆదివారం జరి గాయి. ఈ సందర్భంగా సీనియర్ పెన్షనర్లను శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సీతారాం మాట్లాడుతూ.. పెన్షనర్ల హెల్త్‌కార్డులు అన్ని కార్పొరేట్ ఆస్పత్రిల్లో పనిచేసేలా చూడాలన్నారు. భీమారం పెన్షనర్స్ యూనిట్ అధ్యక్షుడు ఎర్రబెల్లి కమలాకర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, కార్యదర్శి నారాయణగిరి వీరన్న, భీమారం యూనిట్ ప్రతినిధులు వెంకన్న, సదానందం, దేవరాజం, జనార్దన్‌రావు పాల్గొన్నారు.